ప్రజాశక్తి
శనివారం 17 మే 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





హత్య కేసులో

ఏడుగురికి జీవితఖైదు

మూడో అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పూర్ణిమ తీర్పు

ప్రజాశక్తి-చీరాల

2023 అక్టోబర్ పదిన సంవత్సరంలో చీరాల మండలం, వాడరేవులో జరిగిన హత్య కేసులో నిందితులుగా ఉన్న ఏడుగురికి శుక్రవారం హత్య కేసులో తీర్పును మూడో అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఏ.పూర్ణిమ వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారందరికీ జీవిత ఖైదుతో పాటు రూ.2 వేల జరిమానాను విధించారు.

చీరాల మండలం, వాడరేవు గ్రామంలో మోస సూరిబాబు(48) హత్య కేసులో చోడిపిల్లి ఎలియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు విచారణ అధికారి అయిన అప్పటి చీరాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లికార్జునరావు నేర స్థలాన్ని సందర్శించారు. ప్రత్యక్ష సాక్షులను విచారించి.. భౌతిక సాక్ష్యాధారాలను సేకరించి.. ముద్దాయిలు నేరం చేసినట్లు తగిన సాక్ష్యాధారాలతో నిరూపించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న పిక్కి సింహాద్రి, పిక్కి శాంతి, సింహాద్రి, బొంది డేవిడ్ రాజు, పిక్కి రాజు, పిక్కి ఆనంద్, పిక్కి సత్తమ్మ, ఓరుపిల్లి మాణిక్యరావు ఏడుగురికి జీవిత ఖైదు శిక్ష పడింది.

అసలేం జరిగింది..

చీరాల మండలం, వాడరేవు గ్రామానికి చెందిన మతుడు మోస సూరిబాబు ముద్దాయి పిక్కి సింహాద్రికి మూడు లక్షలు అప్పుగా ఇచ్చాడు. అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదు. సూరిబాబుకు ఎ1 ముద్దాయి పిక్కి సింహాద్రి భార్య అయిన ఎ2 ముద్దాయి పిక్కి శాంతిల మధ్య అక్రమ సంబంధం ఉందని పుకార్లు వచ్చాయి. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న సింహాద్రి, పిక్కి శాంతి, బొంది డేవిడ్ రాజు, ఏ రాజు, పిక్కి రాజు, పిక్కి ఆనంద్, పిక్కి సత్తమ్మ, ఓరుపిల్లి మాణిక్యరావుతో పాటు చట్టంతో సంఘర్షణకు గురవుతున్న అతని కుమార్తె, మరొక బాలుడిని కలుపుకొని సూరిబాబుని చంపడానికి పథకం వేశారు. ఆ పథకంలో భాగంగా ఎ1 ముద్దాయికి కూతురును వివాహం చేసుకోమని నమ్మబలికారు. ఈ క్రమంలో నేరం జరిగే ఐదు రోజుల ముందు నుంచి ఇంటికి భోజనానికి రావలసిందిగా పిలిచాడు. 2023 అక్టోబర్ 10న రాత్రి 8 గంటలకు సూరిబాబుని ▶ 2లో

పాఠశాలల విలీనం..

ప్రాథమిక విద్యకు శరాఘాతం

- విద్యారంగ సంస్కరణలు.. విద్యార్థులకు చేటు
- పాఠశాలల మార్పు ప్రక్రియ.. తల్లిదండ్రులకు భారం.
- పాఠశాలల పునర్వవస్థీకరణతో 22 ఉర్దూ మీడియం పాఠశాలలు, 41 ఉర్దూ పోస్టులు రద్దు



ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

'జాతీయ విద్యా విధానం' అమలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగమే గత ప్రభుత్వం జిఒ 117 అమలు, కూటమి ప్రభుత్వం జిఒ 19, 20, 21ల అమలు ప్రక్రియ.. జెండాలు వేరైనా అజెండా ఒక్కటేనన్న చందంగా ఉంది. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు. ప్రభుత్వ విధానాలతో10 వేల మంది ప్రభుత్వ బడులకు దూరం కానున్నారు.

గత ప్రభుత్వం జీవో 117తో ప్రాథమిక పాఠశాలలను 6 కేటగిరిల పాఠశాలలుగా మార్చడం, (3 నుంచి 5 తరగతులు) ఉన్నత పాఠశాలలలో విలీనం చేయడం, తెలుగు మీడియం రద్దు వంటి ప్రక్రియ వల్ల, ఉన్నత పాఠశాలలు అందుబాటులో లేకపోవడం తదితర కారణాల వల్ల ప్రకాశం జిల్లాలో సుమారు 10 వేల మంది చదువు మానిన వారుగా, 'ప్రభుత్వ పాఠశాలల చదువుకు దూరమైనవారు'గా విద్యాశాఖ గుర్తించింది. ఒక్కసారిగా ఆంగ్ల మధ్యమాన్ని అందుకోలేక విద్యార్థులు ఆందోళన చెందారు. అధిక సంఖ్యలో తెలుగు మీడియంలో పదో తరగతి పరీక్ష రాశారు. ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు 117 జిఓ రద్దు కోరుతుండగా, కూటమి ప్రభుత్వం పరిశీలిద్దాం.. అంటూనే.. విద్యారంగాన్ని మరింత విచ్ఛిన్నం చేసే హానికరమైన జివో 19, 20, 21లతో ఈ విద్యాసంవత్సరం నుంచి అమలుకు ప్రయత్నం చేస్తోంది. నూతన విద్యావిధానంలో 6 దశల పాఠశాలల స్థానంలో 9 దశల పాఠశాలల వ్యవస్థ రూపొందనుంది. ఈ ప్రక్రియ వల్ల ఈసారి మరో 10 వేల మంది విద్యార్థులు 'ప్రభుత్వ బడులకు' దూరం అయ్యే ప్రమాదం ఉందని విద్యా నిపుణుల విశ్లేషణ.

41 ఉర్దూ పోస్టులకు ఉద్వాసన

కూటమి ప్రభుత్వం చేపట్టిన విద్యాసంస్కరణల చర్యల వల్ల జిల్లాలోని 381 ఉన్నత పాఠశాలలో 275 మంది స్కూల్ అసిస్టెంట్స్ మిగిలిపోనున్నారు. అయితే వీరిలో కొందరిని మోడల్ ప్రైమరీ పాఠశాలలకు బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇంకా మిగిలిన వారిని' కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పూల్ లో ఉంచుతారని సమాచారం. జిల్లాలో కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు తదితర ప్రాంతాల్లో 22 ఉర్దూ ▶ 2లో

గాలివాన జోరు..పిడుగుల హోరు..!



ఉప్పుగుండూరులో తడిసిన పొగాకు పందిర్లు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో శుక్రవారం తెల్లవారుజామున ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. దీనికి తోడు పలు చోట్ల పిడుగులు మోత మోగించాయి. పాకలలో ఓ ఇంటి మీద పిడుగు పడి స్వల్ప నష్టం చేకూరింది.

ఊళ్లపాలెంలో రామాలయంపై పడిన పిడుగులు..

ఊళ్లపాలెం గ్రామ పంచాయతీలోని బిసిన్ పల్లెపాలెంలో పిడుగులు ఒక్కసారిగా పడటంతో రామాలయం మీద విగ్రహాలు మొత్తం దెబ్బతిన్నాయి. కొన్ని విగ్రహాలయితే పూర్తిగా దెబ్బతినగా.. మరికొన్ని విగ్రహాలైతే అక్కడక్కడా దెబ్బతినటం ఇక్కడ చోటుచేసుకుంది. ఎక్కువ పిడుగులు అక్కడే పడటం వల్ల ఇలా జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. రైల్వేస్టేషన్లో నూతన నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో వర్షం ▶ 2లో



పిడుగుపాటుకు శింగరాయకొండలో దెబ్బతిన్న రామాలయం

జిజిహెచ్ చరిత్రలో మైలురాయి..

- గుండెకు స్టంట్ అమర్చిన వైద్యులు
- విజయవంతంగా స్టంట్ ప్రొసీజర్
- సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు వెల్లడి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఏడుకొండలరావు, కార్డియాలజిస్ట్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇక పేద గుండెకు భరోసా కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఏప్రిల్ 11న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించిన క్యాథ్ల్యాబ్ నెల తిరగకుండానే స్టంట్ వేసే స్థాయికి చేరుకుంది. స్టంట్ ప్రొసీజర్ను జిజిహెచ్ వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిజిహెచ్ ఆర్ఎంఒ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు కరోనరీ ఏంజియోప్లాస్టీ వివరాలను వెల్లడించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ క్యాథ్ల్యాబ్ ప్రారంభించిన నెల రోజుల్లో స్టంట్ ఆపరేషన్ను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారన్నారు. లక్షల్లో ఖర్చయ్యే స్టంట్ ఉచితంగా ఒంగోలు జిజిహెచ్లో సాధ్యం కావడం గర్వకారణమన్నారు. ఈ ఘనత సాధించిన కార్డియాలజీ విభాగంలో వైద్యసిబ్బందిని డాక్టర్ ఏడుకొండలరావు అభినందించారు. జిజిహెచ్లో ఎన్నో అరుదైన చికిత్సలు జరుగుతున్నాయని, ఆ కోవలో స్టంట్ వేయటం మరో మైలురాయి అని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చీమకుర్తిలో ఆటో డ్రైవర్గా పనిచేస్తున్న కె.ప్రసాద్ అనే వ్యక్తి గుండె సంబంధిత జబ్బుతో ▶ 2లో

పాఠశాలల విలీనం..

ప్రాథమిక విద్యకు శరాఘాతం..

(మొదటిపేజీ తరువాయి)

మీడియం పాఠశాలల్లోనూ 19 ఉర్దూ సెక్షన్ పాఠశాలల్లో పనిచేస్తున్న 41 మంది ఉర్దూ మీడియం సెకండరీ గ్రేడ్ టీచర్లు పోస్టులు రద్దవనున్నాయి. ఉర్దూ పాఠశాలలను, ఉర్దూ సెక్షన్లు రద్దు చేస్తూ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల 41 మంది ఉర్దూ టీచర్లు తెలుగు నేర్చుకుని తెలుగులో బోధించవలసిన పరిస్థితి ఉంది. ఇదిలా ఉండగా ఉర్దూ పాఠశాలలు, ఉర్దూ సెక్షన్ లలో అభ్యసిస్తున్న విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారనుంది.

ప్రాథమిక పాఠశాలల వ్యవస్థ నిర్వీర్యం

సాటిలైట్, ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ, వంటి పాఠశాలలలో విద్యార్థులు – ఉపాధ్యాయ ల కూర్పు అశాస్త్రీయంగా ఉన్నట్టు ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయం. ఈ పాఠశాలల్లో 20–30 మందికి (విద్యార్థు లు) ఒకరే ఉపాధ్యాయుడు అన్ని పాఠ్యాంశాలు బోధించవల సి ఉంటుంది. ఈ కారణంగా విద్యార్థులు చదువుల పట్ల ఆసక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. జిల్లాలో ఈ పాఠశాలలు 2,158 ఏర్పాటు చేయనున్నారు. భవిష్యత్తులో ఇవన్నీ ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయే ప్రమాదం లేకపోలేదు. కాగా కాన్వెంట్ చదువులకు అలవాటు పడిన గ్రామీణ ప్రజలు కష్టమో నష్టమో తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపే అవకాశాలు లేకపోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో అల్పాదాయ వర్గాలకు ఆర్థిక భారమైనప్పటికీ పిల్లల చదువుల కోసం ప్రైవేట్ పాఠశాలలు ఆశ్రయించక తప్పదు. (ఈ పాటికే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో ప్రైవేట్ పాఠశాల్లకు పంపే ప్రక్రియ కొనసాగుతుంది) ఈ పరిస్థితుల్లో ఈ పాఠశాలలని మూత వేసే ప్రమాదం ఉందని ఉపాధ్యాయుల అభిప్రాయం.

– ఒకటి నుంచి 8 తరగతి వరకు యూపీ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు నిర్వహించే ఉన్నత పాఠశాలల్లో, ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు నిర్వహించే పాఠశాలల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాల, కళాశాల వంటి వేరువేరుగా హంగులు, వసతులు కల్పించకపోతే ఆ పాఠశాలలు కూడా సజావుగా నిర్వహించే పరిస్థితి ఉండదు. అటువంటి పాఠశాలలు సుమారు జిల్లాలో 200కు పైగా ఉన్నాయి. ప్రభుత్వం పాఠశాలలో కావలసిన సదుపాయాలు, బోధన సిబ్బందిని ఏర్పాటు చేయాలి. లేని పక్షాన అక్కడ అభ్యసించే విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వలసపోక తప్పదు. గతంలో జిల్లాలో ఏర్పాటు చేసిన '14 ప్లస్ టు(కాలేజీలు) విద్యాసంస్థల్లో ఏడుగురు చొప్పున బోధన సిబ్బందిని నియమించి.. తరగతి గదులు, లేబొరేటరీ, సదుపాయాలు కల్పించినందున ఆ విద్యాసంస్థలు నిర్వహించలేకపోయారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న 98 మంది బోధన సిబ్బందిని మిగులుగా చూపించడం గమనార్హం.

ఇద్దరికి తక్కువ కాకుండా ఉండాలి...

డి.వీరాంజనేయులు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రతి గ్రామంలో ప్రతిపాదిత ఫౌండేషన్ స్కూల్ స్థానంలో 1 నుంచి 5 తరగతులు ఉండే ప్రాథమిక పాఠశాల ఉండే విధంగా చర్యలు గైకొనాలి. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశం కోసం తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించాలి. మైనారిటీ భాషల మాధ్యమాలను కూడా కొనసాగించాలి.

ప్రభుత్వ విద్యాసంస్థలు కనుమరుగే..

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వినోద్

గత ప్రభుత్వం జీవో నెంబర్ 117 తీసుకొచ్చి ఆరు రకాల పాఠశాలను ప్రవేశపెట్టారు.కూటమి ప్రభుత్వం జీవో నెంబర్ 117 రద్దు చేస్తు జీవో నెంబర్ 19, 20, 21 జీవోలు తీసుకొచ్చి ఆరు రకాల నుంచి 9 రకాల పాఠశాలను తీసుకొచ్చింది. ఈ విధానాల వల్ల ప్రభుత్వ విద్యాసంస్థలన్నీ కనుమరుగై ఆ స్థానంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఏర్పాటవుతాయి. తక్షణమే ఈ జీవోలు రద్దు చేయాలి. జాతీయ విద్యాహక్కు చట్టం ప్రకారం గ్రామానికి ఒక పాఠశాల ఐదుగురు టీచర్స్ మౌలిక సదుపాయాలతో కూడుకున్న ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని చెప్తుంది. దానికి విరుద్ధంగా నేటి కూటమి ప్రభుత్వం పాఠశాలను ఎలా కుదించాలనే ఆలోచన విధానం తీసుకొస్తోంది. దీని వల్ల పేద, బడుగు, బలహీనవర్గానికి విద్య అందని ద్రాక్షగా మారుతుంది.



చేపల విక్రయ కేంద్రం గేటు బయట వేచి చూస్తున్న బాధిత మహిళలు

చేపల విక్రయ కేంద్రానికి తాళం

నగర పంచాయతీ సిబ్బంది అత్యుత్సాహం

ప్రజాశక్తి-గిద్దలూరు: చేపల వ్యర్థాలు రహదారిపై వేస్తున్నారనే నెపంతో చేపల విక్రయ కేంద్రానికే నగర పంచాయతీ సిబ్బంది తాళం వేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని కుమ్మరామంకట్ట వద్ద ఉన్న చేపల విక్రయకేంద్ర స్థలంలో చేపల విక్రయాలు చేసుకుంటున్నారు. ఈ చిరు వ్యాపారులు చేపల విక్రయ కేంద్రం వద్ద చేపల వ్యర్థాలు వేసేందుకు డస్ట్‌బిన్ ఏర్పాటు చేయలేదు. దీంతో చేపల విక్రయ నిర్వాహకులు అక్కడే వ్యర్థాలను పడేస్తున్నారు. అయితే డస్ట్‌బిన్ ఏర్పాటు చేయకుండా, చెత్త వ్యర్థాలను రహదారిపై పడేయకుండా చేపల విక్రయదారులకు అవగాహన కల్పించకుండా, అనాలోచితంగా చేపల విక్రయ కేంద్రానికి నగర పంచాయతీ సిబ్బంది తాళం వేయడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు. ఈ చర్యతో వ్యాపారం చేసుకోలేకపోవడంతో బాధిత మహిళలు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారం నిర్వహించలేక దిగాలుపడి చేపల విక్రయ కేంద్రం గేటు బయట వేచిచూస్తున్నప్పటి చిత్రమిది.

జిజిహెచ్ చరిత్రలో మైలురాయి

(మొదటిపేజీ తరువాయి)

కార్డియాలజీ విభాగాన్ని సంప్రదించారన్నారు. అతనికి యాంజియోగ్రామ్ చేయగా గుండె కుడి వైపు రక్త నాళాలలో ఆటంకాలను గుర్తించి.. వెంటనే స్టంట్ వేయాలని సూచించామన్నారు. ప్రసాద్ నిర్ణయం తీసుకోడానికి కొంత సమయం పడుతుందని చెప్పిన మరుసటి రోజే అత్యవసర విభాగంలో చేరారన్నారు. ఈ విషయాన్ని కార్డియాలజీ విభాగానికి చెప్పటంతో వెంటనే అవసరమైన పరీక్షలు నిర్వహించి.. కుటుంబసభ్యుల అనుమతితో స్టంట్ అమర్చామన్నారు. ప్రస్తుతం టెండర్ ద్వారా సరఫరా అవుతున్న స్టంట్‌లు అత్యంత నాణ్యమైనవని, వీటిని చెన్నై విజయ ఆసుపత్రి, బెంగళూరు ప్రఖ్యాత జయదేవ్ ఆసుపత్రిలో వాడుతున్నట్లు తెలిపారు. అటువంటి నాణ్యత ఉన్న స్టంట్ అమర్చిన ప్రసాద్ ఎంతో ఆరోగ్యంతో ఉన్నారని తెలిపారు. ఇదే సర్జరీ ప్రైవేట్ ఆసుపత్రులలో చేయించుకుంటే రూ.రెండున్నర లక్షలు అవుతుందన్నారు. రోగి ప్రసాద్ మాట్లాడుతూ విజయవంతంగా స్టంట్ వేసిన వైద్యులకు కతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ మాధవీలత, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, కార్డియాలజీ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్రిడ్జ్ అందజేస్తున్న దృశ్యం

క్రీడా వికాస కేంద్రానికి వాటర్ ఫ్రిజ్ అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని క్రీడా వికాస కేంద్రానికి శుక్రవారం యర్రగొండపాలెం ఎంపీడీవో బండారు శ్రీనివాసులు కూలింగ్ వాటర్ ఫ్రిజ్‌ను బహూకరించారు. ప్రస్తుత వేసవి ఉక్కిరిబిక్కిరి చేసే ఎండల దృష్ట్యా క్రీడలు ఆడే యువకులు, యువతులు దాహార్తిని తీర్చుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. క్రీడాకారులు శారీరకంగా, మానసి కంగా దృఢంగా ఉండేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వ, స్థానిక అధికారుల సహ కారం అవసరమని అన్నారు. తాను తన సామర్థ్యంతో వారి కోసం ఏదైనా చేయాలనే భావనతో ఈ వాటర్ ఫ్రిజ్‌ను అందజేస్తున్నానని చెప్పారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్ర మాలు చేపడుతోందని తెలిపారు. యర్రగొండ పాలెంలో మరింత మెరుగైన క్రీడా వాతావరణం ఏర్పడేందుకు తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడా వికాస కేంద్రం సభ్యులు ఎంఈవో–2 మల్లు నాయక్, ప్రేమ్ నాయక్, బాలు నాయక్, శేఖర్ నాయక్, షేక్ షకీల్, దీప్లా నాయక్, యేసా నాయక్‌తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

గాలివాన జోరు.. పిడుగుల హోరు..

(మొదటిపేజీ తరువాయి)

రావడంతో ప్రయాణికులు నీరు నిల్వ ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాలులకు కాపుకి వచ్చి ఉన్న మామిడికాయలు కొన్నిచోట్ల నేలకు ఒరిగాయి.

అకాల వర్షం..ఆందోళనలో రైతులు

నాగులుప్పలపాడు: గురువారం అర్ధరాత్రి ఒక్కసారిగా గాలి దుమారం, ఉరుములతో కూడిన వర్షం పడటంతో పొగాకు, మిర్చి రైతు లు ఆందోళనకు గురయ్యారు. పంటలను కాపాడుకునేందుకు పరుగులు తీశారు. అయినప్పటికి ఒక్కసారిగా వర్షం రావడంతో పాటు బాగా నిర్లటైం కావడంతో ఫలితం లేకుండా పోయింది. పొగాకు పందిర్లపై ఉన్న పొగాకు తాళ్ళు తడిసి ముద్దయ్యాయి. కంఠ గుంట, ఒమ్మెవరం, రాపర్ల తదితర గ్రామాల్లో పొలాల్లోని కళ్లాల్లో మిర్చి కొంతభాగం తడిసి పోయింది. దీంతో రైతులు దిగాలు పడ్డారు. ఈ ఏడాది మొదటి నుంచి ఒడిదుడుకుల వ్యవ సాయం సాగు చేశారు. పెట్టుబడులు పెరగడం తో పాటు దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దీనికి తోడు ధరలు కూడా పతనవడంతో రైతాంగం నష్టాల బాట పట్టింది. మిర్చి ధర గత సంవత్సరం రూ.20 వేలు పలికింది. ప్రస్తుతం 9 వేలకు పడిపోయింది. పొగాకుకు గత సంవత్సరం ధరలు ఆశాజనంగా ఉండటంతో ఎక్కువ మంది ఆ పంట వైపు మొగ్గుచూపారు. ప్రైవేట్ కంపెనీలు రైతులను ప్రోత్సహించి సాగు చేయించారు. తీరా పంట చేతికి వచ్చిన తరవాత కుంటిసాకులు చూపి చేతులెత్తేశారు. దీంతో నల్లబర్లీ పొగాకు అసలు కొనకపోవ డంతో రైతాంగం దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది.

కూలీలకు డబ్బులు చెల్లిం చలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ అకాల వర్షం రైతులను మరింత దెబ్బతీసింది.

'వలీమా'లో ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిశోర్‌రెడ్డి

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం, హనుమంతరాయునిపల్లె గ్రామంలో షేక్ మౌలాలి కుమారుడు నాయబ్ రసూల్ వలీమా కార్యక్రమం లో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ మెంబర్ షేక్ హసీనా, దప్పిలి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురికి జీవితఖైదు

(మొదటిపేజీ తరువాయి)

ఇంటికి భోజనానికి రావలసిందిగా సింహాద్రి పిలిచాడు. భోజనానికి వెళుతున్నట్లు అక్క అయిన చోడపిల్లి ఎలియమ్మ కు చెప్పి వెళ్ళాడు. ముందుగా ముద్దాయి ఇంటిలో రాడ్లు, పైపులు, కర్రలతో సిద్ధంగా ఉన్న ముద్దాయిలు విచక్షణారహితంగా అతడిపై దాడి చేసి హతమార్చారు. భోజనానికి వెళ్లి తన తమ్ముడు తిరిగి రాకపోయేసరికి, అనుమానం వచ్చి ఎలియమ్మ ముద్దాయి ఇంటికి వెళ్లి చూడగా ముద్దాయిలందరూ మతుడు సూరిబాబుని తీవ్రంగా కొట్టి గాయపరచి హత్యచేశారు. చోడపిల్లి ఎలియమ్మ ఇచ్చిన రిపోర్ట్ మేరకు అప్పటి చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి జనార్ధన్‌రావు హత్య కేసు నమోదు చేశారు. కేసు విచారణ అధికా రి అయిన అప్పటి చీరాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున రావు నేర స్థలాన్ని సందర్శించారు. ప్రత్యేక్ష సాక్షులను విచారించి భౌతిక సాక్ష్యాధారాలను సేకరించి ముద్దాయిలు నేరం చేసినట్లు తగిన సాక్ష్యాధారాలతో నిరూపించి.. 2023 అక్టోబర్ 15న అరెస్ట్ చేశారు. తదుపరి దర్యాప్తును కొనసాగించిన అప్పటి ఇన్‌ఛార్జి ఇన్స్పెక్టర్ అయిన జి.సోమశేఖర్ నిపుణుల నివేదికను పొందుపరిచి సంబంధిత న్యాయస్థానంలో 2023 డిసెంబర్ 30న ఛార్జ్‌షీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో న్యాయమూర్తి తీర్పునిచ్చింది.

ఎస్పీ తుషార్‌డూడి అభినందనలు

నేరం చేసిన నిందితులకు న్యాయస్థానంలో కఠిన శిక్షలు విధించే విధంగా చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు న్యాయం చేకూరుతుందని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. నేరం చెయ్యాలి అనుకునే వారికి ఇటువంటి తీర్పులు వెలువడినప్పుడు భయం అనేది ఏర్పడుతుందని నేరం జరిగిన 18 నెలలోనే నిందితులకు జీవిత ఖైదు పడేవిధంగా సమగ్ర దర్యాప్తు నిర్వహించిన పోలీస్ అధికారులను, ట్రయిల్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ, సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చిన చీరాల డిఎస్పీ మోయిన్, రూరల్ సిఐ శేషగిరి రావు, కోర్ట్ లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ షేక్ కరిముల్లా, ప్రాసిక్యూషన్ తరపున సమర్థవంతంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామేశ్వరరెడ్డిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

డెంగీ దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-టంగుటూరు

దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని, దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు, జికా లాంటి వ్యాధులు వస్తాయని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైధ్యాధికారి డాక్టర్ ఎస్. ప్రసాద్‌బాబు తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి బైపాస్ రోడ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. డెంగీ గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో సాధారణంగా అనాఫిలస్, క్యూలెక్స్, ఎడిస్, మాన్సోనియా ఆర్మిజరిస్ దోమలు పెరుగుతాయని తెలిపారు.డెంగీ వైరల్ జ్వరమని, ఇది ఎడిస్ దోమకాటు వల్ల వస్తుందని తెలిపారు. ఎడిస్ దోమ పగటి పూట కుడుతుందని తెలిపారు. అధిక జ్వరం, తలనొప్పి, కంటి వెనుక బాగంలో నొప్పి, కండరాల నొప్పులు జుట్టు ఊడిపోవటం, చర్మంపై గుండ్రటి మచ్చలు డెంగీ లక్ష్యణాలు అని తెలిపారు. డెంగీ వ్యాధి నివారణకు ఫాగింగ్, దోమల లారా ధ్వంసం, ఆరోగ్య క్యాంపులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వినియోగంలో లేని నీటి తొట్లు, డబ్బాలు, టైర్లు, తాగి పడవేసిన కొబ్బరి బోండాల్లో వర్షపు నీరు చేరి దోమల ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో టైర్లు, తాగి పడవేసిన కొబ్బరి బోండాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యమంలో డాక్టర్ పి.జయలక్ష్మి, సిహెచ్ఒ మాతయ్య, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కనిగిరిలో ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

శింగరాయకొండ : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ వంశీధర్ ఆధర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి కందుకూరు రోడ్డు కూడలి వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య కష్ణ మాట్లాడుతూ దోమల నివారణకు మూడు పద్ధతులు పాటించాలన్నారు. పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అనే నినాదంతో ప్రజల సహకారంతో దోమలను నిర్మూలించవచ్చునని తెలిపారు. డాక్టర్ దీరేందర్ మాట్లాడుతూ దోమలు ఉత్పత్తిని నివారణించేందుకు ప్రజలు తమ ఇంటి పరసర ప్రాంతాల్లో నీల నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ చేసే డబ్బాలు, తొట్ల మీద మూతలు ఉంచాలన్నారు. ఇడిస్ దోమ కాటు వల్ల డెంగీ వ్యాధి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి. పీరయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, విజయమ్మ, సంపూర్ణమ్మ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కనిగిరి : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గఫార్ మాట్లాడుతూ ప్రజలుతమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా లాంటి ప్రమాదకర వ్యాధుల



టంగుటూరులో మానవహారం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ సజన, గుడ్ హెల్ప్ డైరెక్టర్ మండ్రు రమేష్ బాబు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శి : డెంగీ నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అర్బన్ సిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ చేతన్ తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అర్బన్ పిహెచ్‌సి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చేతన్, మలేరియా ఇన్‌ఛార్జి బసవారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మరియు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, హెచ్ఒ సుహాసిని, నర్సులు పాల్గొన్నారు.

కొత్తపట్నం : ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా కొత్తపట్నం పిహెచ్‌సి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రమ్య దీపికా మాట్లాడుతూ ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో కొబ్బరి బోండాలు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పాత టైర్స్, పూల కుండీలు, తొట్లలో నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేష్ కుమార్ రాజు, సిహెచ్ఒ ఓంకార్, ఇందిరా దేవి, సూపర్ వైజర్లు సులోచన,ప్రభాకర్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు



వైసిపి నాయకులతో మాట్లాడుతున్న దద్దాల

పాలేటి గంగమ్మ గుడి సందర్శన

ప్రజాశక్తి- పిసిపల్లి

పాలేటి గంగమ్మ గుడి, కాటమరాజు విగ్రహాన్ని వైసిపి కనిగిరి నియోజక ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం సందర్శించారు. అనంతరం వైసిపి కార్యకర్తలు ఏర్పాటు చేస్తున్న విద్యుత్తు ప్రభలను పరిశీలించారు. తిరునాళ్ల శాంతియుతంగా జరుపుకోవాలని వారికి సూచించారు. దద్దాల నారాయణ వెంట ప్రభ నిర్వాహకులు, పరిమి వెంకటేష్ చౌదరి,చెన్నుపాటి వెంకటరావు రేగల బాలయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి- కొనకనమిట్ల : మండల పరిధిలోని ఇరసలగుండం గ్రామ ఎంపిటిసి కరేటి నాగలక్ష్మి, రామ కోటేశ్వరరావు దంపతుల కుమారుడు కరేటి చైతన్య,అంజలి వివాహ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లు మాజీ ఎమ్మెల్యేలు జంకె వెంకటరెడ్డి, ఉడుముల శ్రీనివాసుల రెడ్డి, అన్నా రాంబాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మోరబోయిన మురళీకష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం. రమేష్ ,రేగడపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కామసాని వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె తాత్కాలిక వాయిదా : సిఐటియు

ప్రజాశక్తి-చీమకుర్తి

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన సమ్మెను జూలై 9కి వాయిదా వేసినట్లు సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. స్థానిక పంగులూరి కష్ణయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కాలం సుబ్బారావు మాట్లాడారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతనం రూ. 26000 ఇవ్వాలని, నిత్యవసర వస్తువుల ధరలు అదుపు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె చేయాలని ముందుగా నిర్ణయించినట్లు తెలిపారు. దేశంలో ఏర్పడిన భౌతిక పరిస్థితుల కారణంగా కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. జూలై 9న సమ్మె చేయాలని



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు

నిర్ణయించినట్లు తెలిపారు. కార్మిక వర్గాలు జులై 9న నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, మండల నాయకులు .లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాటికలను ప్రోత్సహించడం అభినందనీయం

ప్రజాశక్తి - దర్శి

నేటి కాలంలో నాటికలను ప్రోత్సహించటం అభినందనీయమని టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో దర్శనాపురి నాటకళాపరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12వ నాటక పోటీలను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య కళాభారతి కరీంనగర్ వారు ప్రదర్శించిన ఖరీదైన జైలు నాటిక, అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారు ప్రదర్శించిన చిగురు మేఘం నాటిక అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు,



మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

దర్శనాపురి నాటకళాపరిషత్తు కార్య వర్గ సభ్యులు డాక్టర్ ప్రసాద్ రెడ్డి పి. గాలయ్య. ధని రెడ్డి వెంకటరెడ్డి, జివి.కీర్తి, రంగారావు మార్తుల వెంకటేశ్వర రెడ్డి, మోషే పాల్గొన్నారు



రూప మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు

స్కూటీని ఢీకొన్న లారీ..
తల్లి మృతి, కూతురికి గాయాలు

ప్రజాశక్తి- కొల్లూరు

స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ముసలపాడు చెరువు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... అమృతలూరు మండలం మూల్పూరు గ్రామానికి చెందిన ఇంటూరి రూప రూప(38), ఆమె కుమార్తె సుభాషిణి కొల్లూరు మండలం ఆలపాటి నగర్‌లో వివాహ వేడుకలకు హాజరయ్యారు. వివాహ వేడుకల అనంతరం తమ స్వగ్రామం మూల్పూరుకు స్కూటీపై బయలు దేరారు. ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో రూప అక్కడికక్కడే చెందింది. స్కూటీ నడుపుతున్న సుభాషిణికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి -మద్దిపాడు

ఆగిఉన్న కారును బైకు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి గాయాల్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు నుంచి విజయవాడకు వెళుతున్న కారు గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ సమీపంలోని అంజలి గ్రానైట్ ఫ్యాక్టరీ ఎదురు ఆగింది. అదే సమయంలో బైకుపై వస్తున్న మద్దిపాడు మండలం కీర్తిపాడు గ్రామానికి చెందిన కార్తీక్ ఢీకొన్నాడు. దీంతో కార్తీక్ గాయాలయ్యాయి. బైకుపై ఉన్న మరో యువకుడికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రున్నిఒంగోలు రిమ్స్‌కు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సిఎస్ పురం

మండల పరిధిలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో టిడిపి గ్రామ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. టిడిపి మండల అధ్యక్షుడు బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. టిడిపి గ్రామ అధ్యక్షుడిగా ముత్యాల వెంకటేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చిన్నావుల శ్రీనివాసులు, బూతు కన్వీనర్‌గా సమ్మన తిరుపతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, గంగిరెడ్డి రామ చంద్రారెడ్డి,అట్లూరి రామకష్ణంరాజు,యూనిట్ ఇన్‌ఛార్జి వెంకట కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గొట్టిపాటి లక్ష్మి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-దొనకొండ : దొనకొండ మండలం వెంకటాపురం పంచాయతీ పరిధిలోని బ్రహ్మణపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బద్వేలుకు చెందిన బ్రహ్మశ్రీ ఓరుగంటి సీతారామశర్మ, గ్రామ పురోహితులు రెంటచింతల సత్యనారాయణశర్మ, వేదపండితుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాల నడుమ విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


ప్రజాదర్బార్లో అర్జీలు స్వీకరిస్తున్న నరేంద్రవర్మ

ప్రజా సమస్యలకే ప్రాధాన్యత

ప్రజాశక్తి - బాపట్ల


ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజలు అందించే ప్రతి అర్జీని పరిశీలించి ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా కృషి జరుగుతుందని అన్నారు. స్వీకరించిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులకు సూచిస్తామని అన్నారు. పార్టీ పరమైన సమస్యలైతే తామే స్వయంగా పరిశీలించి అర్జీదారులకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. ప్రజాదర్బార్లో ఒక్కసారి వచ్చిన అర్జీ తిరిగి పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిసి లీలకుమార్

భక్తుల దర్శనానికి పూర్తి ఏర్పాట్లు

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఈనెల 19 వరకు మహాకుంభాభిషేక జరుగు తుందని, దీనిని విజయవంతం చేయడానికి దేవాదాయ శాఖ సహాయకంగా నియమించినట్లు కాకాని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం డిసి లీల కుమార్ అన్నారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్గా ఆయన శుక్రవారం విధులు నిర్వహించేందుకు సింగరకొండ దేవస్థానంనకు వచ్చారు. దీనిలో భాగంగా మహాకుంభాభిషేకం జరిగే సమయంలో భక్తులు స్వామివారి దర్శనం కోసం అన్నీ ఏర్పాట్లు చేసినట్లు ఇఒ మదమంచి తిమ్మనాయుడు తోలినాకె, ప్రశాంత వాతావరణంలో భక్తులు స్వామివారి దర్శనం కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అతిథులందరినీ ఆహ్వానించి వారికి సరైన ఏర్పాట్లు దర్శనం కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.


ఇఒకు విరాళం చెక్కు అందజేస్తున్న దాతలు

మండప నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి రాత్రి ముఖ మండప నిర్మాణానికి కాకానిపాలెంకు చెందిన గడ్డం బసవయ్య జ్ఞాపకార్థం వెంకటరత్నం, కుమార్తె అనంతలక్ష్మి రూ.1,01,116, పాములపాటి రామారావు జ్ఞాపకార్థం భార్య సుబ్బాయమ్మ, మనవడు సాయి శంకర్ రూ.1,00,116, వీరియంట్ ఇన్ఫ్రా అధినేత అడుసుమల కిషోర్ బాబు, పార్వతీ దంపతులు రూ.1,00,116 విలువైన విరాళం చెక్కులను దేవస్థానం ఇఒ మదమంచి తిమ్మనాయుడుకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వేద పండితులు హరిశంకరావధాని, గిరిధర్ కిషోర్, ఎస్ఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - అద్దంకి


మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ల ద్వారా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని, దానికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్మించడం ద్వారా కార్మికులు తమ హక్కులు కాపాడుకోవచ్చుని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్లో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలు కార్మికులతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయడంలో వెనకపట్టు పడుతున్నాయని అన్నారు. దీంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. మున్సిపల్ వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా ప్రభుత్వ ఉద్యోగుల జాబితా ప్రకారం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులు కాకుండా చేస్తున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం కార్మికుల అందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక జిఒ తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఈ నెల 20న జరగాల్సిన సార్వత్రిక జాతీయ సమ్మె దేశంలో వచ్చిన ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో జులై 9కి వాయిదా వేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం వలె నేటి కూటమి ప్రభుత్వం కూడా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమవుతుందని అన్నారు. ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 20న నిరసన ర్యాలీలు నిర్వహించాలని ఆయన కోరారు. నేడు పాలక ప్రభుత్వాలు ప్రజలు, కార్మికుల్లో ఐక్యత విచ్ఛిన్నం చేసి హక్కులు కాలరాసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. వీటిని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమాలు చేయడంలో సిఐటియు అగ్రభాగాన ఉందని అన్నారు. రోజువారి పారిశుధ్య కార్మికులకు మిగతా కార్మికుల వలె నెలకు రూ.21వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికుల్లో ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చి మిగతా కార్మికులతో సమాన వేతనాలు ఇవ్వాలని, అందుకోసం అవసరమైతే ప్రభుత్వాలపై ఒత్తిడికి ఉద్యమించాలని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ అద్దంకి పట్టణ విస్తరణ పెరుగుతుందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులు పెరగక పోవడంతో ఉన్న కార్మికుల మీద పని భారం పెరిగి ఒత్తిడికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నుల వసూల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉన్న అద్దంకిలో మౌలిక సౌకర్యాలు కల్పించడం, తగిన పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచడంలోనూ పాలకవర్గం వైఫల్యం చెందుతుందని ఆరోపించారు. సత్వరమే కార్మికుల సంఖ్య పెంచి మున్సిపాలిటీలో సంపూర్ణ ఆరోగ్య పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి ఆదాము, భీష్మ, శామ్యూల్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - రేపల్లె


ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తాగటానికి మంచి నీళ్లు ఇవ్వండి అంటూ పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ (జగన్ కాలనీ)లో ఖాళీ బిందెలతో మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. ఎన్టీఆర్ నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంచినీళ్ల కోసం ఖాళీ బిందెలతో మహిళలు కలెక్టర్ను వేడుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ వెయ్యి మంది కొత్తగా ఇళ్ళు నిర్మించుకుని నివాసం ఉంటున్న జగన్ కాలనీలో బోర్లు పాడైపోవడం, వేసవిలో మంచినీళ్లు లేకపోవడంతో మున్సిపల్ అధికారులకు నెల రోజుల వ్యవధిలో అనేక వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవటం లేదని అన్నారు. మునిసిపల్ విభాగంలో వాటర్ సెక్షన్ బాధ్యత చూసే అధికారులు నిర్లక్ష్యంగా, చులకనగా మాట్లాడుతున్నారని ఆవేదనతో ఖాళీ బిందులతో నిరసన తెలిపారు. కనీసం కలెక్టర్ గారైన తమ నిరసన ద్వారా స్పందించి త్రాగటానికి మంచినీళ్లు అందించాలని కోరారు. ఈపాటికే జిల్లాలో నివసిస్తున్న ప్రజలందరికీ వేసవిలో నీళ్ల సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ చెప్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పట్టణంలో ప్రజలకు మంచినీళ్లు అందించకపోవడం అంటే ప్రభుత్వం ఉన్నట్టా? లేనట్టా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ నేతలు మాటలు మాత్రం ఘనంగా చెప్తూ ప్రతి వారం టిడిపి ఆఫీసులోనూ సమస్యలు చెప్పుకొండంటూ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారని అన్నారు. సమస్యలపై వేడుకుంటున్నప్పటికీ పరిష్కారం చేయకపోవడం దారుణమని అన్నారు. అధికారులు వెంటనే జగన్ కాలనీలో పాడైన బోర్లను బాగుచేసి తక్షణం మంచినీళ్లు అందించాలని కోరారు. కనీసం ప్రతిరోజు ఉదయం రెండు ట్యాంకర్లు, సాయంత్రం రెండు ట్యాంకర్ల ద్వారా తాగే నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. వెలగని లైట్ల స్థానంలో కొత్తలైట్లు వేస్తామని చెప్పినప్పటికీ సగం స్తంభాలకు లైట్లు వెలగడం లేదని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి ధనమ్మ, కె అశ్విరాధాం, కె నాంచారమ్మ వి పిచ్చయ్య, గౌస్, కె వీరాంజనేయులు, ఎ నాగలక్ష్మి పాల్గొన్నారు.

వాగులు పొంగి... నిలిచిన రాకపోకలు


పిడుగుపాటుకు పగిలిన పిట్టగోడ చూపుతున్న మహిళ

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని గురువారం రాత్రి కిరిసిన వర్షంతో వింజనంపాడు, పోలూరు గ్రామాలకు మండల కేంద్రంకు, పోలూరు వద్ద వాగు పొంగి ప్రవహించడంతో రాక పోకలు నిలిచి పోయాయి. కుమ్మరపాలెం, వింజనంపాడు మధ్య తొండి వాగు పొంగి ప్రహిస్తుండటంతో అటుగా వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రాత్రి రెండుగ గంటలకు కరెంట్ పోయింది. దీనితో చిన్న పిల్లలు, వృద్ధులు నిద్ర పోవడానికి అవస్థలు పడ్డారు. తొండి ఎవ్వరూ వాగు దాటకుండా పోలీసు సిబ్బంది కాపలా ఉన్నారు. వర్షం కారణంగా ఖాళీ స్థలాలు, పొలాల్లో మండెలు వేసిన బర్లీ పోగాకు తడిసి పోయింది. గిట్టుబాటు ధరరాక ఇబ్బంది పడుతున్న రైతులు అకాల వర్షం వచ్చి పంట తడిసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలూరు గ్రామానికి చెందిన మహ్మద్రఫీ ఇంటి పిట్టగోడపై పిడుగు పడి ఇంటిలోని టివి, ఇతర పరికరాలు కాలిపోయాయి.

ఇంకొల్లు : ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇంకొల్లులో భారీగా కురిసింది. దీంతో ఇంకొల్లు, పూసపాడు అడ్డరోడ్డు వద్ద ఉన్న కప్పల వాగు పొంగిది. ఈ వాగు పొంగటంతో పర్చూరు, నూతలపాడు మీదుగా ఇంకొల్లుకు, అడ్డ రోడ్డుకు రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ సిబ్బంది వాగు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసు పహారా ఏర్పాటు చేశారు. ఇంకొల్లు సీఐ రమణయ్య శుక్రవారం ఉదయం వాగు ఉధృతిని పరిశీలించారు. వాగు ప్రవాహం తగ్గేవరకు రాకపోకలకు ప్రత్యామ్నాయంగా కొనసాగించాలని అన్నారు. ఇంకొల్లు ఒకటో వార్డులో రజక కాలనీ సమీపాన హై స్కూల్ వెనుక వీధిలో మురుగునీటి ప్రవాహానికి అడ్డంగా చెత్తకుప్పలు, వ్యర్థాలు పడటంతో అక్కడ మురుగునీరు చేరింది. ఈ విషయాన్ని గతంలో పలుమార్లు పంచాయితీ అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ పట్టించుకోవటం లేదని ఆ ప్రాంతవాసులు తెలిపారు. మురుగునీరు ప్రవహించ కుండా ఉండటం వలన దోమలు ప్రబలి వ్యాధులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్చూరు : మండలం అన్ని గ్రామాల్లో శుక్రవారం తెల్లవారు జామున వాతావరణం ఒక్కసారిగా మారింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటీతో నిండిపోయాయి. స్థానిక ఇందిరా కాలనీ, నెహ్రూ కాలనీ వాసులు ఇబ్బందులకు గురయ్యారు. వాహనదారులు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా సరఫరా నిలిపివేశారు. కొన్ని గంటలకే మరలా విద్యుత్తు పునరుద్ధరించారు. వైట్ బర్లీ పొగాకు తడవకుండా ఆకునిల్వలపైన పట్టలు కప్పి రైతులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి జాగ్రత్తలు వహించారు. పర్చూరులో 81.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. అకాల వర్షంతో పర్చూరులో సైడ్ కాలువలు పొంగి రోడ్ల మీదకి ప్రవహించింది. వర్షపు నీటికి మురుగునీళ్లు తోడై రోడ్లపైకి రావడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. కొన్ని రోడ్లు బురద మయం అయ్యాయి. చీరాల రోడ్డులో అక్కడక్కడ రోడ్లపై నీరు నిలవడటంతో వాహన రాకపోకలతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.


కప్పలవాగు ఉధృతిని పరిశీలిస్తున్న సీఐ రమణయ్య

ప్రజాశక్తి
శనివారం 17 మే 2025

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

ప్రత్యేక ఆకర్షణగా 150 అడుగుల జెండా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆపరేషన్ సింధూర్‌లో దేశ సైనికుల ధైర్యసాహసాలు, త్యాగాలను కొనియాడుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన తిరంగా ర్యాలీలో భాగంగా శుక్రవారం ఒంగోలులో చేపట్టిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. కూటమి నేతల ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా ర్యాలీ ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభమై చర్చి సెంటర్, ట్రంకు రోడ్డు మీదగా అద్దంకి బస్టాండ్ వరకు సాగింది.



150 అడుగుల జెండాతో విద్యార్థుల ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న యువత వందే మాతరం, భారత్ మాతాకీ జై, మురళి నాయక్ అమర్ రహే, ఆపరేషన్ సింధూర్‌కి జై నినాదాలతో నగర వీధులన్ని దద్దరిల్లాయి. క్విస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన 150 అడుగుల జాతీయ పతాకం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు. బండారు మదన్, బోడపాటి వెంకట్, నాళం నరసమ్మ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ పథకాలు

సమగ్రంగా అమలు చేయాలి

'మాల కార్పొరేషన్' చైర్మన్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025-26 యస్.సి. కార్యాచరణ ప్రణాళిక అమలులో చేపట్టవలసిన మార్పులపై అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ సూచనలు చేశారు. శుక్రవారం నాడు స్థానిక భాగ్యనగర్‌లోని డిడిటిసిలో ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, దళిత సంఘాల నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యస్.సి. ప్రజల అభ్యున్నతికి తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. ఎస్సీ నిరుద్యోగుల ఉపాధి కోసం జిల్లాలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ప్రకాశం జిల్లాలోని పేద



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

దళితులు. నిరుద్యోగ యువకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు గురించి, వారికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రకటించిన పలు పథకాల గురించి ఈ సందర్భంగా చర్చించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు. దళిత ఉద్యోగ సంఘాల సభ్యులు ఎస్సీ యాక్షన్ ప్లాన్‌లో చేపట్టవలసిన మార్పులు, పలు సమస్యలు ఏకరువు పెట్టారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె అర్జున్ నాయక్, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

టిడిపి విద్యుత్ ప్రభల వద్ద 'ఉగ్ర'

ప్రజాశక్తి-పిసిపల్లి

పాలేటి గంగమ్మ వద్ద జరుగుతున్న తిరునాళ్లకు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం నాడు హాజరయ్యారు. టిడిపి ప్రభల వద్దకు ఆయన విచ్చేశారు. తెలుగుదేశం నాయకులతో కొంతసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ తిరునాళ్ల జరుపు కోవడం అభినందనీయమన్నారు. శాంతి యుతంగా జరుపుకోవాల న్నారు.



ప్రభల వద్దకు ఉగ్ర నరసింహారెడ్డి

పోతవరానికి చెందిన సర్పంచ్ రావి రాజా ఏర్పాటుచేసిన ప్రభ వద్దకు మురుగుమ్మి ఎంపిటిసి చెరుకూరు సతీష్‌తో కలిసి వెళ్లారు. పోతవరం చెందిన వడ్డేంపూడి వెంకటరావు ఏర్పాటు చేసిన ప్రభ వద్ద స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్ తహశీల్దార్‌గా నాయబ్‌రసూల్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు రూరల్ తహశీల్దార్ నాయబ్‌రసూల్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన వలేటివారిపాలెం మండల డిటిగా పనిచేస్తూ.. అడహక్ తహశీల్దార్‌గా ఉద్యోగోన్నతిపై ఒంగోలు రూరల్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన నాయబ్‌రసూల్‌కు ఒంగోలు తహశీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నాయబ్‌రసూల్ డిఆర్‌ఒ ఓబులేషును, ఆర్డీవో లక్ష్మీప్రసన్నను మర్యాదపూర్వకంగా కలిశారు.




నాయబ్‌రసూల్

కొండపిలో మోస్తరు వర్షం

కట్టావారిపాలెంలో ఇంటిపై పడిన పిడుగు

ప్రజాశక్తి-కొండపి;

శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన మోస్తారు వర్షం మండలంలో కురిసింది. భానుడి ప్రతాపంతో కొన్ని రోజులుగా అల్లాడుతున్న ప్రజలు తెల్లవారుజామున కురిసిన వర్షానికి కొంత ఊపిరి పీల్చుకున్నారు. కురిసిన కొద్దిపాటి వర్షానికి కరెంట్ సిబ్బంది తెల్లవారుజామున 2:30 నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.విద్యుత్ సరఫరా నిలిచివేయడంతో చిన్నపిల్లలు,వద్దులు ఇబ్బందులు పడ్డారు. కొండపిలోని స్థానిక విష్ణాలయం వీధిలో సైడు కాలంలో లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డు మీద నిలబడడంతో ఆ వీధిలోని ప్రజలు వాహనదారులు ఆ రోడ్డులో నడవడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.అధికారుల స్పందించి ఆ వీధిలో సైడ్ కాల్వ ఏర్పాటు చేసి రోడ్డుమీద నీరు నిలవకుండా చూడాలని కోరుకుంటున్నారు. పంచాయతీలోని కట్టవారిపాలెం గ్రామంలో ఒక ఇంటి పైకప్పు సమీపంలో పిడుగు పడటంతో గోడ స్వల్పంగా దెబ్బతినింది. ఆ ఇంటిలోనే విద్యుత్ వైర్లు కాలిపోయాయి.ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కొండపిలో విద్యుత్ తీగల తెగిపడడంతో వెంటనే విద్యుత్ సిబ్బంది స్పందించి మరమ్మత్తులు నిర్వహించి విద్యుత్ సరపరా ఇవ్వడం జరిగింది.



ధర్నా చేస్తున్న కార్మికులు


కూలి రేట్లు పెంచాలని ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ పరిధిలోని పలకల పారిశ్రామికవాడలో డిజైన్ స్లేట్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని సిఐటియు డిమాండ్ చేసింది. పలకల పరిశ్రమ యాజమాన్య అసోసియేషన్ కార్యాలయం ఎదుట డిజైన్ స్లేట్ వర్కర్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ మాట్లాడుతూ పాత కూలి రేట్ల ఒప్పందం ముగిసిందని, అయినా కూలి రేట్లు పెంచడం లేదన్నారు. ఈ విషయంలో జాప్యం చేయడం సరికాదన్నారు. పెరిగిన నిత్యావసరాలతో కార్మికులు సతమతమవుతున్నారని, తక్షణమే కూలిరేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ విషయంపై ఈపాటికే నోటీసు ఇవ్వగా యాజమాన్యం స్పందించింది. కార్మిక సంఘాల నేతలతో చర్చలకు ఆహ్వానం పంపారు. రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో కార్మికులకు ప్రస్తుతం ఒక డ్యూటీకి చెల్లిస్తున్న రూ.297 నుంచి రూ.371కి పెంచాలని యజమానులను కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరారు. యజమానులు మాత్రం రూ.320 మాత్రమే పెంచగలమని చెప్పారు. కార్మికులు కూడా ఓ మెట్టు దిగారు. కనీసం రూ.340కి తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌కు యజమానులు అంగీకరించలేదు. మొండిగా వ్యవహరించడంతో చర్చలు వాయిదా పడ్డాయి. యజమానుల మొండి వైఖరిని నిరసిస్తూ యాజమాన్య అసోసియేషన్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నాకు దిగారు.

కూలి రేట్లపై జరిగిన చర్చల్లో సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ, సిఐటియు పట్టణ కార్యదర్శి పి రూబెన్, డిజైన్ స్లేట్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి రాములు, ప్రకాశం, శేషగిరి, మాబు, బ్రహ్మయ్య, తిరుపాలు, శారా, ఓనర్స్ అసోసియేషన్ తరపున వెన్నా పోలిరెడ్డి, రావి రమేష్‌రెడ్డి, గుప్తా ప్రసాద్, మోరా వెంకటేశ్వరరెడ్డి, దొండపాటి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మెటీరియల్ అందజేస్తున్న మండవ మురళీకృష్ణ

మెడికల్ విద్యార్థికి సహకారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మెడికల్ విద్యార్థికి సూర్యశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ వారు సహకారం అందించారు. తెలంగాణ రాష్ట్రంలోని సిద్ధిపేట సురభి మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ మూడో సంవత్సరం చదువుతున్న సురారపు పూజిత అనే విద్యార్థినికి ప్రవాస భారతీయుడు బొంత శామ్యూల్ సమకూర్చిన 25 వేల రూపాయల విలువైన మెడికల్ బుక్స్, స్టెతస్కోప్, నూతన వస్త్రాలని ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ ద్వారా విద్యార్థినికి అందజేశారు. మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ పూజితకి గత రెండు సంవత్సరాలుగా సహకారం అందిస్తున్నామని, భవిష్యత్తులో కూడా పూజితకు ట్రస్ట్ తరపున సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారుడు మండవ సుబ్బారావు, ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్‌భాషా, సింగంశెట్టి జాలయ్య పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఖాళీ స్థలాల లీజు వేలం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎపిపిటిడి జోన్-3, నెల్లూరు పరిధిలోని వివిధ బస్‌స్టేషన్/బస్ డిపోలలో ఖాళీగా ఉన్న 26 ఓపెన్ ప్రదేశాలలో 15 సంవత్సరాలకు లీజు పద్ధతిలో ఇవ్వటానికి బిడ్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ఆర్‌టిసి ఆర్‌ఎం జి.సత్యనారాయణ శుక్రవారం నాడు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 10 నుంచి 28 వరకు అప్లికేషన్స్ ఆన్లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు.

మెరుగైన జీవనోపాధికి ప్రభుత్వం కృషి

- శిక్షణా కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోండి
- మహిళలకు పిలుపునిచ్చిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మెరుగైన జీవనోపాధి కోసం ప్రభు త్వం ఏర్పాటు చేస్తున్న శిక్షణ కార్యక్రమా లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని డాన్ బాస్కో ఐటిఐ సెంటర్‌లో మహిళలకు ఇస్తున్న టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న మహిళతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. వారి కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా సాధికారత సాధించాలని, స్వశక్తితో ఎదగాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఈ దిశగానే పలు పథకాలను అమలు చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 31 సెంటర్లలో టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల పాటు జరిగే ఈ శిక్షణలో ప్రస్తుతం 4233 మంది శిక్షణ తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులందరూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జిల్లా బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

ఒంగోలులో టౌన్‌ప్లానింగ్ ఆర్‌డి పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ టౌన్ ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ గుంటూరు రీజనల్ డైరెక్టర్ మధుకుమార్ శుక్రవారం ఒంగోలు వచ్చారు. ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఒడా), ఒంగోలు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఆఫీసు కార్యాలయాలను సందర్శించారు. ఆయా శాఖల పరిధిలో ఒంగోలు నగర అభివద్ధికి తీసుకుంటున్న చర్యలు, ప్రణాళికలు, కొత్త జీవోలు అమలుపై అధికారులతో మాట్లాడారు. త్వరలోనే మరలా ఒంగోలు వచ్చి శాఖాపరంగా జరుగుతున్న పనులపై సమీక్షిస్తానని చెప్పారు. ఆర్డీ వెంట ఒంగోలు నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుధాకర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాబూరావు, ఒడా, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ట్రీ కటింగ్ కారణగా డి4 పరిధిలోని కొత్తపట్నం బస్టాండ్, తూర్పు క్రిస్టియన్ పాలెం, రంగుతోట, మరాటిపాలెం, ఆనందరావు రోడ్, పాత మార్కెట్, గానుగపాలెం, నీలాయపాలెం, ట్రంక్ రోడ్ తదితర ప్రాంతాలలో ఉదయం 6.30 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి.. సహకరించాలని కోరారు.

పురాతన విగ్రహాల పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల

నియోజకవర్గ పరిధిలో పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో 2003లో లభించిన పురాతన విగ్రహాలను కోర్టు ఆదేశాల మేరకు పురావస్తు శాఖ అధికారులు శుక్రవారం బాపట్ల తహశీల్దారు కార్యాలయంలో శుక్రవారం పరిశీలించారు. డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం చందోలు గ్రామానికి చెందిన మహమ్మద్ అన్వర్ అలీ అన్సారి పొలం మరమ్మతు చేస్తుండగా 2003లో విలువైన పురాతన దేవతామూర్తుల గ్రహాలు నాలుగు, పూజా సామాగ్రి బయటపడ్డాయి. అప్పట్లో వీటిని ఆ రైతు చందోలు పోలీసులకు అప్పగించారు. పోలీసులు వాటిని అధికారుల పర్యవేక్షణలో బాపట్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేశారు. అ తర్వాత రైతు అన్వర్ అలీ అన్సారి విగ్రహాల విలువలో తనకు వాటా కావాలని 2014లో హైకోర్టును ఆశ్రయించాడు. పురావస్తు శాఖాధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. పట్టు వదలని విక్రమార్కుడిలా రైతు అన్సారి హైకోర్టును ఆశ్రయించారు. పురావస్తు శాఖ అధికారులు కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ రైతు తరఫున హైకోర్టు న్యాయవాది కె జోసఫ్ కోర్టులో కేసు వేశారు. దీంతో ఎట్టకేలకు పురావస్తు శాఖాధికారులు స్పందించారు. బెంగుళూరుకు చెందిన దక్షిణ భారతదేశ పురావస్తు శాఖ రీజనల్ డైరెక్టర్ ఎన్‌కె పాఠక్ బృందం శుక్రవారం బాపట్ల తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. స్థానిక రెవెన్యూ అదధికారులతో కలిసి సబ్ ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేసిన విగ్రహాలను తీసుకొచ్చి పరిశీలించారు. తూనికల యంత్రాన్ని తెచ్చి వాటి బరువు, విలువ లెక్క కట్టారు. నివేదికను కోర్టుకు సమర్పించనున్నట్లు డిఆర్ఓ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి గ్లోరియా, తహశీల్దారు షేక్ సలీమా, చందోలి ఎస్ఐ శివకుమార్, పురావస్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.



పురావస్తు విగ్రహాలు పరిశీలిస్తున్న అధికారులు

'కారుమూరి'కి కళా పురస్కారం

ప్రజాశక్తి - పర్చూరు

గత ఎన్నో ఏళ్లుగా కళారంగానికి సేవలు చేస్తున్న తెలుగు నాటక రంగ కృషివలుడు, నంది అవార్డు గ్రహీత, పర్చూరుకు చెందిన కారుమూరి సీతారామయ్య జానపద కళాపీఠం అద్దంకి రజ తోత్సవాల్లో భాగంగా వీరవల్లి రంగయ్య, యశోదమ్మ స్మారక కళా పురస్కారాన్ని నేడు అందుకో నున్నారు. ఆయన రంగస్థల నటులు, దర్శకులు, గుణ నిర్ణీత, నాటక రంగ రచయిత, విశ్లేషకులు. ఆయన గతంలో అనేక అవార్డులు, సత్కారాలు అందుకున్నారు. ఏడు దశాబ్దాలుగా ఆధునిక కళా రంగంతో అనుబంధం ఉన్న కారుమూరి రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు, ఉగాది సాహితి పురస్కారం అందుకున్నారు. తెలుగు భాష సమితి నుండి బంగారు పతకం, చిలకలూరిపేట కళా సదస్సు నుండి ఇచ్చిన నాటక కృషీవలుడు అవార్డు, బాపట్ల అప్పాజ్యోసుల నుండి జీవిత సేవా పురస్కారం అవార్డు, తెనాలి వారి నుండి ఎన్టీఆర్ అవార్డు స్వీకరించారు. గుంటూరు వారి నుండి అక్కినేని నాగేశ్వరరావు ప్రపంచ రంగ స్థలం పురస్కారం గతంలో అందుకున్నారు. గత నెలలో 90వ పుట్టిన రోజు జరుపుకున్న సీతారామయ్య కళా రంగంపై ఉన్న అనుబంధంతో సేవలు చేస్తూ అవార్డులు పొందుతున్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కోట హరిబాబు, శారద హైస్కూల్ కరస్పాండెంట్ కృష్ణశెట్టి రామకోటేశ్వరరావు, పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపం నిర్వాహకులు కటారి సురేంద్రబాబు, రొటేరియన్ కోటా శ్రీనివాసరావు అవార్డు గ్రహీత కారుమూరి సీతారామయ్యకు అభినందనలు తెలిపారు.



పురస్కారం అందుకోనున్న కారుమూరి సీతారామయ్య

జ్యోతిర్మయికి ఎండిఎస్ పరీక్షల్లో 47వ ర్యాంక్

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణానికి చెందిన పీటా జ్యోతిర్మయి ఆల్ ఇండియా నీట్ పీజీ ఎండిఎస్ ప్రవేశ పరీక్షల్లో 47వ ర్యాంక్ సాధించినట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన జ్యోతిర్మయి ఇంటర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. అనంతరం సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్‌లో బిడిఎస్ పూర్తి చేసిన డాక్టర్ జ్యోతిర్మయి ప్రస్తుతం పిజిలో ఆల్ ఇండియా 47వ ర్యాంక్ సాధించడంతో పలువురు అభినందించారు.



డాక్టర్ జ్యోతిర్మయి



కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని సంజీవనగర్‌లో ఏర్పాటు చేసిన కట్టు మిషన్ కేంద్రాన్ని ఎంపిడిఒ బి సింగయ్య, డిప్యూటి ఎంపిడిఒ ఆర్‌విఎస్ ప్రసాదరావు శుక్రవారం తనిఖీ చేశారు. తనిఖీలో ట్రైనీస్ హాజరు పరిశీలించారు. సెంటర్‌కు కావలసిన అన్నీ వసతుల ఏర్పాట్లు గురించి లబ్ధిదారులతో మాట్లాడారు. లేని వసతులు వెంటనే ఏర్పాటు చేసువాలని సూచించారు. అందరూ వంద శాతం హాజరు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అందిస్తున్న పొదుపు సంఘాల రుణాలు, వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రాజెక్ట్ మేనేజర్ కె శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వాడరేవు గ్రామంలోని మహిళా సమాఖ్య పరిధిలోని సిఎంటిసి బిల్డింగును శుక్రవారం ఆయన పరిశీలించారు. త్వరలో ప్రారంభం కానున్న ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కార్యాలయంలోని డోమా విభాగంను ఆయన తనిఖీ చేసి సమైక్య బుక్స్ పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సూచనలు ఇచ్చారు. వార్షిక క్రెడిట్ ప్లాన్‌కు సంబంధించి బుర్లవారిపాలెం పంచాయతీ పరిధిలోని గ్లోరీ గ్రామ సంఘాన్ని విజిట్ చేసి వార్షిక ప్రణాళికలో గ్రూప్ సభ్యుల అవసరాల నిమిత్తం రుణం అందించాలని సూచనలు చేశారు. చేనేత వస్త్రం తయారీపై ఎలా చేస్తున్నారనేది చూసి వారితో మాట్లాడారు. ఎలా చేస్తున్నారనేది అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెర్ఫ్ బ్యాంకు లింకేజ్ డైరెక్టర్ రమాదేవి, మూర్తి, విన్సెంట్, బ్యాంకు లింకేజీ ఆచారి, ఏరియా కో ఆర్డినేటర్ సుబ్బారావు, ఏపీఎం కడెం మధుసూదనరావు, వేటపాలెం ఏపిఎం అంజిబాబు, సీసీ బుజ్జి, విఒఎలు పాల్గొన్నారు.



సీఎంటీసీ బిల్డింగ్ పరిశీలిస్తున్న పిడి కె శ్రీనివాసరావు

విజన్ తయారీకి అధికారులు సహకరించాలి

ప్రజాశక్తి - పర్చూరు

స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా నియోజకవర్గ విజన్ ప్రణాళిక తయారీకి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా పిడి ఎ విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఆరు మండలాల ఎంపిడిఒలు, మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర 2047లో భాగంగా ఈపాటికే మండల స్థాయి, జిల్లా స్థాయి యాక్షన్ ప్లాన్ తయారు చేశారని తెలిపారు. నియోజకవర్గం స్థాయి విజన్ ప్లాన్ రాబోయే ఐదేళ్లకు తయారు చేయాలని చెప్పారు. స్థానిక వనరులు, సామాజిక అంశాలు, ప్రజా అవసరాలకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని చెప్పారు. నియోజకవర్గ విజన్ ప్లాన్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఉంటారని చెప్పారు. ప్లాన్ తయారికి నియోజకవర్గ కేంద్రంలో ఐదుగురు ప్రత్యేక ఉద్యోగులను నియమించినట్లు తెలిపారు. వారికి సరైన డేటా అందజేయాలని కోరారు. గ్రామస్థాయి ప్లాన్‌ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ఈ విజన్ ప్రణాళికలో 9 చాప్టర్లు ఉంటాయని తెలిపారు. నియోజకవర్గం వ్యవసాయ ఆధారితం కావడంతో వ్యవసాయానికి 65శాతం ప్రాధాన్యత కల్పిస్తారని, సర్వీస్ సెక్టార్‌కు 23 శాతం, ఇండస్ట్రియల్ సెక్టార్‌కు 12 శాతం ప్రాధాన్యత కల్పిస్తూ విజన్ ప్లాన్ తయారు చేయాలని చెప్పారు. స్థానిక శాసనసభ్యుని సూచనలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ ఉండాలని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి పిడి ఎ విజయలక్ష్మి

బీఎస్పీ జిల్లా అధ్యక్షునిగా రాజారావు

ప్రజాశక్తి - బాపట్ల

బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా గుదే రాజారావును నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ప్రకటించారు. పట్టణంలో శుక్రవారం జరిగిన బహుజన సంకల్ప సభకు హాజరైన గౌతమ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నూతన కమిటీలు నియమించే క్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా గుదే రాజారావును నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఎస్‌పి జిల్లా ఇంచార్జిలు తమ్ములూరి వెంకయ్య, చిట్టిమల్ల సంగీతరావు, నియోజవర్గ ఇన్చార్జిలు డొక్కా శీనుబాబు, మంద జోసెఫ్, సీనియర్ నాయకులు గడ్డం ఏలియా, పాలపర్తి సంతమ్మ, నల్లమోతు శామ్యూల్, జాన్సన్, జోసెఫ్, కోపూరి రాజారావు పాల్గొన్నారు.



వేదికపై రాజారావు పేరు ప్రకటిస్తున్న బిఎస్పి నాయకులు



జవాన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంఎల్ఎ నరేంద్రవర్మ

జవాన్ చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా చేపట్టిన భారత సైనికులకు సంఘీభావంగా శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ విజయోత్సవ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. చీలు రోడ్డు సెంటర్ నుండి జమ్ములపాలెం ఫ్లైఓవర్ అంబేద్కర్ సర్కిల్ వరకు జాతీయ జెండాలు పట్టుకొని ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగిన ర్యాలీలో పలువురు వ్యాపారవేత్తలు, విద్యా వంతులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజలు, విద్యార్థులు, వివిధ హెూదాలో ఉన్న ఉద్యోగులు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, యువతీ, యువకులు పాల్గొన్నారు. చీలు రోడ్ నుండి బయలుదేరిన ర్యాలీ అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకొని మానవహారం నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్‌లో అమరుడైన ఆర్మీ జవాను చిత్రపటానికి నివాళులర్పించారు. ర్యాలీలో ఆర్డీఓ గ్లోరియా, తహశీల్దారు షేక్ సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, బాబు నాగేంద్ర, రోటరీ క్లబ్ కార్యదర్శి వేజెండ్ల శ్రీనివాసరావు, జనసేన నాయకులు నామన వెంకట శివ నారాయణ పాల్గొన్నారు.



ఆపరేషన్ సింధూర్ జవాన్లకు మద్దతుగా ర్యాలీ

వేమూరు : ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైనికులకు సంఘీభావంగా వేమూరు గ్రామంలో శుక్రవారం తిరంగా ర్యాలి నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ పురవేదిక వద్ద తిరంగా యాత్ర జరుగుతుందని శాసన సభ్యుని క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి శాసన సభ్యులు నక్కా ఆనందబాబు పాల్గొంటారని, నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జాతీయ జెండాను చేత పట్టుకొని జై భారత్, ఆపరేషన్ సింధూర్ వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఉగ్రవాద చర్యలను అడ్డుకునేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతిని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులతోపాటు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.



వర్మి కంపోస్టు తయారీని పరిశీలిస్తున్న డిఎల్పిఓ

చెత్త నుండి సంపదతో ఆదాయం

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామాల్లో ఇంటింటి నుండి సేకరించే చెత్త ద్వారా సంపద సృష్టించే విధంగా వానపాములతో ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించి తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని డిఎల్‌పిఒ కుమార స్వామి అన్నారు. తూర్పు బాపట్ల పంచాయతీ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. అక్కడ తయారు చేసే వానపాముల ఎరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కుటుంబం నుండి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించి వర్మీ కంపోస్టు, పొడి చెత్త అమ్మకాల ద్వారా పంచాయితీకి ఆదాయ వనరులు పెంచుకోవాలని అన్నారు. ఈ విధానం ద్వారా గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఒక క్రమ పద్ధతిలో చెత్త సేకరణతో పాటు ఆ చెత్తను ఆదాయ వనరుగా మార్చుకోవచ్చని అన్నారు. నందిరాజుతోట గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామంలో రోడ్లపైన, బహిరంగ ప్రదేశాల్లో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పంచాయితీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, షెడ్ మిత్రా కందుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్వైజర్ సంపూర్ణ

రక్తహీనత పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కిషోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా తగిన జాగ్రత్తలు వహించాలని భట్టిప్రోలు సెక్టార్ సూపర్వైజర్ సంపూర్ణ సూచించారు. మండలంలోని ఐలవరం ప్రాథమిక పాఠశాల్లో కిషోర్ వికాసంలో భాగంగా వేసవి శిక్షణ సందర్భంగా శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత నుండి బయట పడేదుకు అవసరమైన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు వినియోగించు కోవాలని అన్నారు. కిషోర బాలికలు ప్రతి ఒక్కరు స్నేహపూరిత వాతావరణ అలవర్చుకొని ఒకరికొకరు వారి అవసరతల గురించి తెలుసుకునేందుకు ప్రయత్నించాలని అన్నారు. మహిళా పోలీసు సుధా మాధురి, ఎఎన్ఎంలు మహాలక్ష్మి, రజిని, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమూరు : కిషోర్ వికాసంలో భాగంగా వేసవి శిక్షణ తరగతుల సందర్భంగా అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మోదుకూరు సెక్టార్ పరిధిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సూపర్వైజర్ నాగరాజకుమారి మాట్లాడుతూ కిషోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. రక్తహీనత బారిన పడకుండా పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కిషోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విద్యుత్తు మరమ్మత్తుల కారణంగా భట్టిప్రోలు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని వేమవరం నుండి రాచూరు వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఎఇ శాంతకుమారి తెలిపారు. వేమవరం, సూరేపల్లి, తాతావారిపాలెం, కోనేటిపురం, పల్లెకోన, ఆళ్ళమూడి, రాచూరు గ్రామాలకు ఉదయం 7 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిచి వేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

దోమకాటు ప్రజారోగ్యానికి చేటు

వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి విజయమ్మ



దోమల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రజల ఆరోగ్యానికి చేటు కలిగించే కీటక జనిత వ్యాధులకు దోమకాటే ప్రధాన కారణమని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ విజయమ్మ అన్నారు. ఈనెల 16న డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తన కార్యాలయం నుండి భారీ ర్యాలీకి ఆమె పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత దోమకాటు నిర్మూలనకు మార్గమని అన్నారు. అందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం అన్నారు. పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది తమ విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ప్రజలు తమ వంతు సహకారంగా తమ గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. జిల్లాలో డెంగీ మరణాలు కొంతమేర రూపుమాపగలిగామని అన్నారు. అందరికీ ఆరోగ్యం అందరి భాధ్యని గుర్తిస్తేనే దోమకాటు వంటి రోగాల బారిన పడకుండా ప్రజలను కాపాడగలమని అన్నారు. మునిసిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ పురపాలక సంఘం, పట్టణ ఆరోగ్యశాఖ, ప్రజల పరస్పర అవగాహనతో పట్టణంలో దోమలు నిర్మూలన చేసి డెంగీ, మలేరియా, బోధకాలు వ్యాధులు ప్రభలకుండా చర్యలు చేపడుతామని అన్నారు. మలేరియా జిల్లా అధికారి గోపినాధ్ మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, కండరాలు, కీళ్ళు నొప్పులు, ఎర్రటి దద్దుర్లు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. అనంతరం పట్టణంలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రుల జిల్లా సమన్వయ అధికారి మోజెస్ పాల్గొన్నారు.

చీరాల : డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఇది శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్నప్పుడే డెంగు వంటి విష జ్వరాల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ యాకోబు అన్నారు. జాతీయ డెంగు దినోత్సవంలో భాగంగా స్థానిక ఏరియా వైద్యశాల నుండి ఆరోగ్య సిబ్బంది డెంగ్యూ వ్యాధిపై అవగాహన శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో విష జ్వరాల బారిన పడి డెంగు లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. ఈ ర్యాలీలో వైద్యధికారులు డాక్టర్ మనిషేనంద, డాక్టర్ శిరీష, డాక్టర్ ప్రణయ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి చింతా శేషుబాబు, కెపి దాస్, అనిల్ కుమార్, సూపర్వైజర్లు రవి కుమార్, బీ బేబమ్మ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

భావ నారాయణస్వామి ఆలయాన్ని పట్టించుకోండి

పురావస్తు శాఖ అధికారులకు భక్తుల వినతి

ప్రజాశక్తి - బాపట్ల

శతాబ్దాల చరిత్ర గల భావ నారాయణ స్వామి ఆలయ సమస్యలపై పురావస్తు శాఖ వెంటనే స్పందించాలని దక్షిణ భారత పురావస్తు శాఖ రీజనల్ డైరెక్టర్ పాఠక్‌కు భక్తులు శుక్రవారం విన్నవించారు. బాపట్లకు విచ్చేసిన పురావస్తు శాఖ రీజనల్ డైరెక్టర్ పాఠక్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనను పలువురు సందర్శకులు కలసి వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. పురావస్తు శాఖ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఆలయ చరిత్రను పలువురు ఆయనకు వివరించారు. ఆలయ ప్రాంగణంలో గతంలో వివాహాలు జరుపుకునే సంప్రదాయం ఉండేదని తెలిపారు. గాలి గోపురం కూలిపోయిన తర్వాత వివాహాలు చేసుకునే వారికి అనుమతులు నిలిపేశారు. పురావస్తు శాఖ పరిధిలోని దాక్షారామలోని భీమేశ్వర స్వామి ఆలయంలో వివాహాలు జరుపుకునే ఆచారం నేటికి కొనసాగుతుందని పలువురు భక్తులు వివరించారు. పురావస్తు శాఖ నిబంధనల ప్రకారం చారిత్రాత్మక కట్టడాలకు కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటి అనుమతిని నిలిపివేసినట్లు తెలిపారు. ఇప్పుడున్న యాగశాల వద్దే శాశ్వతమైన యాగశాల ఏర్పాటు చేయాలని విన్నవించారు. నూతన రథం ఏర్పాటు చేసిన తర్వాత రథం ఎత్తు పెరగటంతో దానికి అనుగుణంగా రథం దగ్గర చేరేందుకు మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో పురావస్తు శాఖ పరిధిలో చరిత్ర కలిగిన ఆలయాల పరిరక్షణ కోసం, వాటిలో అవసరాలు మెరుగుపరిచి చేపట్టాల్సిన చర్యలపై సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు. బాపట్ల ఆర్డిఓ గ్లోరియా, తహశీల్దారు షేక్ సలీమా, బిఎస్ నారాయణ భట్టు, రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామశర్మ, బండి రామ్మూర్తి నాయుడు, కొటికం సుబ్బారావు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేశిరాజు వెంకటరమణ బాబు, ఆలయ అర్చకులు నల్లూరి పాంచజన్య పాల్గొన్నారు.



ఆలయాన్ని సందర్శించిన పురావస్తు శాఖ డైరెక్టర్

స్పెషల్ గ్రేడ్ పంచాయితీగా భట్టిప్రోలు?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలు గ్రామ పంచాయతీని స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా గుర్తిస్తూ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ కానున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సుమారు 25 గ్రామ పంచాయతీలు స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా గుర్తింపు లభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో బాపట్ల జిల్లాలో భట్టిప్రోలు తోపాటు కొల్లూరు, నిజాంపట్నం, కర్లపాలెం గ్రామ పంచాయతీలు ఎంపిక కానున్నాయి. ఈ పంచాయతీల్లో పనిచేస్తున్న ప్రస్తుత కార్యదర్శులు వేరే పంచాయతీలకు బదిలీ కానున్నారు. ఈ పంచాయతీల్లో పనిచేసేందుకు డిప్యూటీ ఎంపిడిఓలుగా పదోన్నతి పొందిన వారు, ఈఓపిఆర్ అండ్ ఆర్‌డిలు గానీ విధులు నిర్వహిస్తారు. గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ వారిని ఇలాంటి స్పెషల్ గ్రేట్ పంచాయతీలకు కేటాయించనున్నారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా గుర్తింపు పొందటానికి ఆ పంచాయతీలో పదివేల మందికిపైగా జనాభా కలిగి ఉండాలి. లేదా ఏడాదికి రూ.కోటి పైగా ఆదాయం కలిగి ఉన్న పంచాయతీలను ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా గుర్తిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ మేరకు త్వరలో ప్రభుత్వం నుండి అధికారిక ఉత్తర్వులు రానున్నాయి.



భట్టిప్రోలు పంచాయతీ కార్యాలయం



కోటపాడు చెరువు దగ్గర ఉన్న తప్పిపోయిన గేదెలు

కోటపాడు చేరుకున్న గేదెలు

ప్రజాశక్తి - పంగులూరు

దారి తప్పిపోయిన గేదెలు మండలంలోని కోటపాడు గ్రామం చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారు పది రోజుల క్రితం కోటపాడు గ్రామానికి నాలుగు గేదెలు, రెండు దూడలు వచ్చాయి. ఇవి పగలంతా పొలాల్లో మేస్తూ సాయంత్రానికి గ్రామానికి చేరుకొని చెరువు దగ్గర గాని, ఇతర ప్రదేశంలో గానీ చేరుకుంటున్నాయి. మళ్లీ ఉదయం 8 గంటల నుండి పొలాల్లోకి వెళ్లిపోతున్నాయి. పది రోజుల నుండి అవి కోటపాడులో ఉంటున్న సొంతదారులు ఎవరు రాలేదని గ్రామానికి చెందిన ఉప్పల మూర్తి, ఏడుకొండలు తెలిపారు. సుమారు రూ.2.50లక్షల విలువచేసే పశువులు ఎవరువైంది, ఏ గ్రామానికి చెందినవైనది అర్థం కాలేదని గ్రామస్తులు తెలిపారు. ఈ పశువుల యజమానులు ఎవరైనా వచ్చి వాటిని తీసుకెళ్లాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.



కౌలు రైతు సమావేశంలో ఎఒ టి బాలాజీ గంగాధర్

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండల రైతాంగానికి పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలు వచ్చాయని ఎఒ టి బాలరాజ్ గంగాధర్ శుక్రవారం తెలిపారు. జీలుగు విత్తనాలు 50శాతం సబ్సిడీ పోను కేజీ రూ.61.50 చొప్పున, జనుము విత్తనాలు 50శాతం సబ్సిడీ పోను కేజీ రూ.54.50 చొప్పున చెల్లించి పొందాలని తెలిపారు. కావలసిన రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ జిరాక్సులతో విఎఎలను సంప్రదించాలని తెలిపారు. కనగాల, అల్లవారిపాలెంలో కౌలు రైతు కార్డులపై అవగాహన కల్పించేందుకు ఆయా గ్రామాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు గుర్తింపు కార్డుల గురించి అవగాహన కల్పించారు. కార్డులు పొందాలని సూచించారు. సమావేశంలో విఆర్ఒ, ఎఇఒ, రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎఒ లోకేశ్వరి

అమృతలూరు : ఈ ఎడాది ఖరీఫ్ సీజన్‌కు కౌలు రైతులు సాగు చేసే భూములకు సంబంధించి సిసిఆర్సి కార్డులకు దరఖాస్తు చేసుకొని పొందాలని ఎఒ ఉయ్యూరు లోకేశ్వరి సూచించారు. మండలంలోని మూల్పూరు, పెదపూడి గ్రామాల్లో కౌలు రైతులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిసిఆర్సి కార్డు పొందడం వలన పంట ఈక్రాప్ నమోదు, బీమా సౌకర్యంతో పాటు ప్రభుత్వం ద్వారా అందించే రాయితీ పరికరాలు పొందటానికి, అన్నదాత సుఖీభవ పథకానికి, పంట నష్ట పరిహారం పొందటానికి దోహద పడుతుందని అన్నారు. పంట సాగు హక్కు పత్రం పొందటానికి కౌలుదారులు తమ ఆధార్ కార్డు, రెండు ఫోటోలు, రైతు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీని తీసుకుని విఆర్ఒకు అందజేసి గుర్తింపు కార్డు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పిల్లి వెంకటేశ్వరరావు, ఎఇఒ టి శ్రీకాంత్, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటిపై లోకేష్ మాటలు వైరల్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అనంతపురం జిల్లాలో జరిగిన ఓ కార్య క్రమంలో విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌పై మంత్రి లోకేష్ సభలో అన్న మాటలు సోషల్‌మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. సభలో అందరి పేర్లు ప్రస్తావిస్తూ.. అందరూ 'గొట్టిపాటి' గురించి మరిచిపోయా రనుకుంటారోమో.. అంటూ 'ఆయన గురించి ఈ ప్రాంతంలో తెలియదు.. 2019 నుంచి 2024 మధ్యలో మన నాయకుడిని అవ మానించినప్పుడు గానీ, శాసనమండలిలో గత ప్రభుత్వం అమరావతిపై పోరాడే సమయంలో గ్యాలరీలోకి చంద్రబాబునాయుడు వచ్చి కూర్చు న్నారని.. ఆయన్ను కావాలని ఆనాటి పాలకులు వైసిపి ఎమ్మెల్యేను పంపించి చంద్రబాబును ఎగతాళి చేయాలని ప్రోత్సహించినప్పుడు గొట్టి పాటి రవికుమార్, స్వామి, అనగాని సత్య ప్రసాద్, ఎమ్మెల్యేలు చంద్రబాబు చుట్టూ నిల బడి.. మమ్మల్ని తాకిన తర్వాతే చంద్రబాబు దగ్గరకు వెళతారు' అని చెప్పిన గొప్ప వ్యక్తి మం త్రి గొట్టిపాటి రవికుమార్ అని వివరించారు. దీంతో సభ మొత్తం కరతాళ ధ్వనులతో మార్మోగింది. లోకేష్ అన్న ఈ మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.



నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఓలు

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ

సమ్మె కొనసాగిస్తాం..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

తమ న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని సిహెచ్‌ఓలు స్పష్టం చేశారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సిహెచ్‌ఓలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ 18 రోజులుగా నిరసన తెలుపుతున్నా అటు ప్రభుత్వం గానీ, ఇటు ప్రభుత్వ అధికారులు గానీ కనీసం పట్టించుకోకపోవడం అత్యంత దారుణమని విమర్శించారు. జోరువానను సైతం లెక్కచేయకుండా గర్భవతులు, చిన్నపిల్లల తల్లులు పెద్దసంఖ్యలో తరలొచ్చి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపి ఎంసిఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ గ్రామీణ, కొండ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తాము అంకితభావంతో పనిచేస్తున్నా.. ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏపీ ఎంసీఏ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ గంటా ప్రసన్న, ఉపాధ్యక్షురాలు జీవనజ్యోతి, పసుపులేటి శైలజ, దీప్తి, కామేష్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకంలో ఆరుగురికి ఉద్యోగాలు

ప్రజాశక్తి ఒంగోలు కలెక్టరేట్



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న బూచేపల్లి

జిల్లా జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన అరుగురు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఆఫీస్ సబార్డినేట్స్‌గా ఉద్యోగాలు కల్పిస్తూ ఉత్తర్వులను జడ్పీ వెంకాయమ్మ అందజేశారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పట్రా లక్ష్మీకి ఒంగోలు జడ్పీ కార్యాలయంలో, సివై మారుతి సాయిరాం ప్రకాష్‌కు వివి పాలెం మండల పరిషత్‌లో, గోసాని అనంతలక్ష్మికి మార్కాపురం మండల ప్రజాపరిషత్, తమ్మినేని ప్రదీప్‌కుమార్‌కు వెలిగండ్ల మండల పరిషత్‌లో, మేకల అనూషకు సంజీవరావుపేట జడ్పీ హైస్కూల్లో, కొమ్మనూరి సునీత రాణికి మార్కాపురం జడ్పీ హైస్కూలు(బాలురు) ఆఫీస్ సబార్డినేట్లు నియమిస్తూ ఉత్తర్వులను జడ్స్ చైర్ పర్సన్ అందజేశారు. వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సిఇఒ బి.చిరంజీవి, డిప్యూటీ సిఇఒ పి.బాలమ్మ, ఎస్టాబిస్మెంట్ సేక్షన్ ఏఓ చల్లా శ్రీనివాసకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు: కమిషనర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



కర్రీ పాయింట్ వద్ద తనిఖీ చేస్తున్న కమిషనర్

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు దుకాణాదారులను హెచ్చరించారు. నగరంలోని పలు హోటళ్లు, కర్రీ పాయింట్లు, దుకాణాల్లో కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న పలువురు దుకాణాదారులకు మొత్తం రూ.34 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు ఏసీ కొండయ్య, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, ఎంహెచ్‌ఒ, అన్ని వార్డుల శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులకు దూరం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అవగాహన ర్యాలీని ప్రారంభించిన డిఎంహెచ్‌ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ టి.వెంకటేశ్వర్లు

దోమలను నివారించటం ద్వారా ప్రజలు వ్యాధులకు దూరం కావచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలు, వెంకటేశ్వర కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన ర్యాలీని డిఎంహెచ్‌ఒ శుక్రవారం ప్రారంబించారు. అనంతరం దోమల నివారణపై ప్రజలందరికీ అవగాహన కల్పిస్తామని వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా అదుపు చేయడం, అవి కుట్టకుండా చూసుకోవడం, దోమ కాటుకు గురైతే సరైన మందులు తీసుకోవాలని సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమము ద్వారా ప్రజలందరికీ ఈ విషయాలను వివరించారు. దోమలు నిల్వ ఉన్న నీటిలోనే గుడ్లు పెడతాయని, ఈ గుడ్లు సుమారు 8 నుండి 10 రోజుల్లో పెద్ద దోమలుగా పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి ప్రతి శుక్రవారం నిల్వ నీటిని పారబోయటం ద్వారా దోమల పెరుగుదలను నీటిలో ఉన్నప్పుడే అరికట్టవచ్చన్నారు. ఇంటి కిటికీలకు, తలుపులు దగ్గర, లెట్రిన్ వెంట్ పైపుకు మెష్ వైర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరల్లో నిద్రించటం, మస్కిటో రెపెల్లెంట్స్ వాడాలన్నారు. సాయంత్రం పొడవాటి చేతులు కలిగిన, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచేలా లేత రంగు దుస్తులు ధరించాలని, పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకుంటూ లోతట్టు ప్రాంతాలు లేకుండా చూడాలన్నారు. మురికి నీటి నిల్వలు, కాలువలలో వారానికి ఒకసారి వేస్ట్ ఆయిల్ లేదా కిరోసిన్ వేయాలని ప్రజలకు సూచించారు. ఇంటి పరిసరాలలో పనికిరాని, పగిలిపోయిన, వాడని వస్తువులు, తాగేసిన కొబ్బరి బండాలు, టీ కప్పులు, పాత టైర్లు వంటి లేకుండా చూడాలన్నారు. ఇంటి పరిసరాలలో దోమలు గుడ్లు పెట్టే అవకాశం లేకుండా చేయాలని, వేపాకు పొగ వేయవచ్చన్నారు. బంతి, తులసి, పుదీనా, లావెండర్, రోస్ మేరీ వంటి మొక్కలను పెంచటం ద్వారా వచ్చే ఘాటైన వాసనకు దోమలు ఇంటి లోనికి ప్రవేశించకుండా అరికట్టవచ్చన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో ఎక్కడైనా నీరు నిల్వ ఉండి దోమ లార్వాలను గమనిస్తే ఆ నీటి పరిమాణాన్ని బట్టి ఒక లీటరు నీటికి 2ఎంఎల్ చొప్పున ఎబేతో తయారు చేసిన స్టాక్ సొల్యూషన్ ను కలపాలన్నారు. తద్వారా దోమల అభివద్ధిని నీటి దశలోనే అరికట్టవచ్చన్నారు. డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు (ఎలీసా టెస్ట్) ఒంగోలు, మార్కాపురం జిల్లా హాస్పిటల్‌లో ఉచితంగా చేస్తారన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావటంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకొనవలసిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా ఎన్. మధుసూదనరావు, సహాయ మలేరియా అధికారి శ్రీనివాసరావు, మాస్ మీడియా అధికారి శ్రీనివాస రావు, వెంకటేశ్వర కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ పి.అభిజ్ఞ చంద్రిక, సబ్ యూనిట్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

డిప్యూటీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకట్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని డిప్యూటీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏఎస్ వెంకట్ సూచించారు. శుక్రవారం నాడు శిక్షణ మరియు ఉపాధి ప్రోత్సాహక సంస్థ, యువజన సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా ఇఎస్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక, మానసిక బలాన్ని కోల్పోతారన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎక్సైజ్) సూర్యనారాయణ, సర్కిల్ ఇన్స్పెక్టర్, సైబర్ క్రైమ్స్ పి.శ్రీమన్నారాయణ, స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీమన్నారాయణ, పలు సైబర్ నేరాలు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, శిరీష యువజన సర్వీసుల శాఖ, స్టెప్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

20న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా ఈనెల 20 ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్ తెలిపారు. కెఎల్ గ్రూప్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, శ్రీ చక్ర హుండాయ్ కంపెనీలో పికింగ్, ప్యాకింగ్, స్టొయింగ్, సార్టింగ్, లోడింగ్, ప్రమోటర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్ విభాగాలలో వివిధ రకాల ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఏదైనా ఐటిఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియేట్, డిగ్రీ పూర్తి చేసిన వారు జాబ్ మేళాకు అర్హులన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు జీతం నెలకు రూ.10,000లు నుండి 19,000లు, పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఇస్తారన్నారు. జిల్లాలోని 18 నుండి 29 సంవత్సరాలు మధ్య ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

ఆహార భద్రత అధికారుల ఆకస్మిక తనిఖీ

పలు టిఫిన్, స్వీట్ దుకాణాలలో శాంపిల్స్ సేకరణ

ప్రజాశక్తి- చీరాల



తనిఖీ చేస్తున్న అధికారులు

పట్టణంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు దాడులు శుక్రవారం నిర్వహించారు. పట్టణంలో టిఫిన్ హోటల్స్‌తో పాటు స్వీట్స్ దుకాణాలలో ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించి.. కల్తీ పదార్థాలను గుర్తించారు. వెంటనే శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపారు. ఈ సందర్భంగా చీరాల ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లోని బాలాజీ క్యాంటీన్లో టిఫిన్ తయారీకి ఉపయోగించే పప్పు దినుసులను పరిశీలించారు. అయితే వాటిలో కల్తీ ఉందని గుర్తించి.. శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు తరలించారు. అదేవిధంగా పొలమేర రోడ్డులోని జానకి టిఫిన్ సెంటర్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. కందిపప్పు నాణ్యతపై శాంపిల్స్ సేకరించారు. లైసెన్స్ రెన్యువల్ చేయకపోవడంతో హోటల్ యజమానిని అధికారులు హెచ్చరించి.. నోటీసులు అందజేశారు. దీంతో పాటు పేరాల అను స్వీట్స్ తయారీ కేంద్రాన్ని పరిశీలించి స్వీట్స్‌లో పరిమితికి మించి ఉపయోగిస్తున్న కలర్స్, ఆయిల్స్ ను గుర్తించి ల్యాబ్‌కు పంపారు. సందర్భంగా జిల్లా ఆహార భద్రత అధికారి గరికపాటి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఆహార నాణ్యత ప్రమాణాలను పాటించని వారిపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారి ప్రణీత్, వినియోగ దారుల సంఘం ప్రతినిధి దాసరి ఇమ్మానియేలు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు 3 డ్రోన్లు అందజేత

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



డ్రోన్లు అందజేస్తున్న దృశ్యం

పోలీస్ శాఖలో సాంకేతికతను వినియోగించుకొని సమర్థవంతంగా విధులు నిర్వ హించేందుకు డ్రోన్లు ఎంతగానో దోహదపడ తాయని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీస్ యంత్రాంగం అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను సులువుగా కట్టడి చేసేందుకు ఉపయోగపడే అత్యాధునిక డ్రోన్ లను దాతలు శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ సమక్షంలో మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు స్టేషన్ ల పోలీస్ అధికారులకు అందజేశారు. మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సభ్యులు కలిసి మార్టూరు పోలీస్ స్టేషన్ కు డ్రోన్ ను బహుకరించారు. దానిని ఎస్పీ చేతుల మీదుగా మార్టూరు సిఐ శేషగిరిరావు అందుకున్నారు. బల్లికురవ మండలానికి చెందిన సూర్య డైరీ యజమాని ఇప్పర్ల అంజిరెడ్డి, సంతమాగు లూరు మండలానికి చెందిన గడిపర్తి రామకష్ణలు బల్లికురవ, సంతమాగులూరు స్టేషన్లకు డ్రోన్ లను బహుకరించారు. వాటిని ఎస్పీ చేతుల మీదుగా సంతమాగులూరు సిఐ వెంకటరావు, బల్లికురవ ఎస్.ఐ నాగరాజు లు అందుకున్నారు. డ్రోన్లను బహుకరించిన దాతలను జిల్లా ఎస్పీ దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి పోలీస్ శాఖ నుండి అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు, మార్టూరు ఇన్స్పెక్టర్ శేషగిరి రావు, సంతమాగులూరు సిఐ వెంకటరావు, బల్లికురవ ఎస్.ఐ నాగరాజు, ఐటి కోర్ ఎస్.ఐ నాయబ్ రసూల్, దాతలు ఇతర అధికారులు పాల్గొన్నారు.